సాక్షి
జనగామ

శుక్రవారం | 28 | ఏప్రిల్ | 2023



'అన్న'లను వెంటాడుతున్న అనారోగ్యం!
మావోయిస్టు పార్టీ నాయకులు అనారోగ్యంతో మరణిస్తున్నారు. దీంతో పార్టీకి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. - 8లో▸



సీఎల్పీ నేతకు సమస్యల వెల్లువ
హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రలో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. . - 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/24^0$

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధికశాతం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి.

న్యూస్‌రీల్

బుగులు వేంకటేశ్వరస్వామికి కలెక్టర్ పూజలు



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామిని గురువారం కలెక్టర్ శివలింగయ్య దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు వారికి అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వాగతం పలికారు. వారి వెంట ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ విమల, ఆలయ ధర్మకర్తలు తదితరులున్నారు.

మత్స్యకారులకు శిక్షణ

జనగామ: జాతీయ మత్స్యకారుల సహకార సమాఖ్య న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో జిల్లాలోని 200 మంది మత్స్యకారులకు గురువారం ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిష్ కోఫెడ్ అధికారులు, జిల్లా మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి



జనగామ రూరల్: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కురిసిన వడగళ్ల వానతో వరి పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని, మామిడి తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఎకరాకు రూ.40 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని, టోకెన్లు సకాలంలో అందించి రవాణాలో ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, బీరప్ప, శివరాజ్, బల్ల శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేలు చెల్లించాలి



జనగామ: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కొమ్మూరి మాట్లాడుతూ ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వడగళ్ల వాన రైతులను నిండా ముంచిందని, దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కోఆర్డినేటర్ సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జనగామ పట్టణ అధ్యక్షుడు మోటె శ్రీనివాస్, లింగాల నర్సిరెడ్డి, నాయకులు ఆలేటి సిద్దిరాములు, బొట్ల నర్సింగరావు, జాయ మల్లేష్, బొరెల్లి సిద్దులు, వండ్లకొండ ఉప సర్పంచ్ గాదె అనిల్, పిక్క బీరప్ప పాల్గొన్నారు.

లీగల్ అడ్వైజర్‌గా కన్నయ్య



పాలకుర్తి/పాలకుర్తి టౌన్: రైతులకు ఉచిత న్యాయ సేవలు అందించడానికి బమ్మెర గ్రామంలో ప్రారంభించిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ పీఎల్‌వీ(ప్యారా లీగల్ వలంటీర్)గా మండల కేంద్రానికి చెందిన కనుకుంట్ల కన్నయ్య నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి పి.ఆంజనేయులు గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. మార్చి 18న తెలంగాణ న్యాయ సేవల అథారిటీ, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, లీగల్ ఎంపవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ(లీఫ్స్) కలిసి బమ్మెరలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించారు. రైతులకు వ్యవసాయ సంబంధిత సమస్యలపై ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించడానికి ఈ క్లినిక్ పనిచేస్తుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఆంజనేయులు చెప్పారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఎం.రవీందర్, డీఎల్ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మె బాట!

- ముగిసిన జూనియర్ పంచాయతీ సెక్రెటరీల ప్రొబేషన్ పీరియడ్
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- ఇప్పటికే కమిషనర్‌కు సమ్మె నోటీసుల అందజేత
- ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ..



ఉపాధి కూలీల వివరాలు తెలుసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి(ఫైల్)

జనగామ రూరల్: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించకపోవడంతో సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పీఆర్ కమిషనర్‌కు హైదరాబాద్‌లో ఇప్పటికే సమ్మె నోటీసులు అందజేశారు. శుక్రవారం(నేడు) సర్వీసులపై స్పష్టమైన ఆదేశాలు రాకపోతే సమ్మె తప్పదంటున్నారు.

2019లో నియామకం..

పల్లెలు, తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జీపీకి ఒక కార్యదర్శి ఉండాలనే ఉద్దేశంతో 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. జిల్లా వ్యాప్తంగా 182 మంది జూనియర్ కార్యదర్శులతోపాటు దశల వారీగా 43 మందిని అవుట్ సోర్సింగ్ ద్వారా తీసుకుంది. తొలి ఏడాదిలో నెలకు వీరికి రూ.15వేల వేతనం చెల్లించగా శిక్షణ కాలం నాలుగేళ్లకు పెంచాక మూడేళ్ల తరువాత రూ.28,719 వేతనం ప్రకటించి చెల్లిస్తున్నది. ప్రొబేషన్ కాలం ముగియడంతో ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుందని ఆశించగా.. ఆ దిశలో కార్యాచరణ లేకపోవడంతో ఆందోళన బాట పట్టేకుందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలో గ్రామ కార్యదర్శులు

మొత్తం జీపీలు :	281
జీపీ కార్యదర్శులు :	182
ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు :	43
రెగ్యులర్ కార్యదర్శులు :	46
ఖాళీగా ఉన్నవి :	10

సర్వీస్ పొడిగింపు ఇలా..

ప్రభుత్వ రాత పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందిన జేపీఎస్‌లు జిల్లాలో 182 మంది ఉన్నారు. వీరు నిబంధనల ప్రకారం రెండేళ్లు ప్రొబేషన్ కింద విధులు నిర్వర్తించాలి. అయితే ఈ కాలాన్ని ప్రభుత్వం మూడేళ్లకు పొడించింది. అంతేకాకుండా జీఓ 26 ద్వారా మరో ఏడాది విధులు నిర్వహించాలని తెలపడంతో ఈనెల 11 నాటికి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో సమ్మె చేయడం తప్పడంలేదని కార్యదర్శులు పేర్కొంటున్నారు.

భారమైనా.. విధుల నిర్వహణ

గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న కార్యదర్శులు 12 రకాల డిపార్ట్ మెంట్ విధులు నిర్వర్తిస్తున్నారు. పని ఒత్తిడి అధికంగానే ఉంది. అయినా భవిషత్‌పై ఆశతో భరిస్తూ ముందుకు వెళ్తున్నారు. పారిశుద్ధ్య పనుల నిరంతర పర్యవేక్షణ, రెవెన్యూ వసూళ్లు, వీధి దీపాల నిర్వహణ, పింఛన్ల పంపిణీ, కల్యాణలక్ష్మి పథకం అమలు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించడం.. హరితహారం, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల నిర్వహణ, మొక్కల సంరక్షణ తదితర బాధ్యతలు చూస్తున్నారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన తర్వాత ఆ పని భారం వీరిపైనే పడింది. ఇంత చాకిరీ చేసినా ఉద్యోగ భద్రత లేక పోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ధర్నాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేపీ కార్యదర్శులు

జనగామ రూరల్: నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను వెంటనే రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా చేపట్టి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడేళ్లు ప్రొబేషన్ కాలంతోపాటు అదనంగా మరో ఏడాది విధులు నిర్వహించామన్నారు. తక్షణమే జూనియర్ కార్యదర్శులతో పాటు ఔట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని, మృతి చెందిన వారి స్థానంలో కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని, అర్హులందరికీ ప్రమోషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్షణమే నిర్ణయం తీసుకోవాలి



కార్యదర్శుల శ్రమను ప్రభుత్వం అర్థం చేసుకుని ప్రొబేషన్ పీరియడ్‌ను డిక్లరేషన్ చేసి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని కూడా జీపీఎస్‌లుగా పరిగణలోకి తీసుకుని సర్వీస్ లెక్కించాలి. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే సమ్మె తప్పదు.

- గర్వందుల శ్రీకాంత్, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

పని ఒత్తిడి ఉన్నా విధులు..



ప్రభుత్వం సూచించిన విధంగా నాలుగేళ్లు విధులు నిర్వహించాం. పని ఒత్తిడి ఉన్నా అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూస్తూ నిరంతరం కష్టపడుతున్నాం. మేము అందిస్తున్న సేవలు, సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. క్రమబద్ధీకణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.

- రమ్య, జేపీ కార్యదర్శి

పనులు వెంటనే పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జనగామ: 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎడ్యుకేషన్, పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఈఈ సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పిల్లలు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు కొనసాగించడానికి అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో జరుగుతున్న సివిల్ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదిక సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చంద్రశేఖర్, హుస్సేన్, పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించండి

లింగాలఘణపురం: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం మండల పరిధి కుందారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. మళ్లీ వర్షాలు, వడగళ్లు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నేలపోగులలో నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీఎస్ఓ రోజారాణి, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, డీసీఓ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథుడి జయంతి

జనగామ రూరల్: భగీరథుడి జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భగీరథుడు గంగ కోసం తపస్సు చేసి భూమి మీదకు రప్పించాడని పుస్తకాల్లో చదువుకున్నామని, ఆయన భక్తి గొప్పతనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. డీఆర్డీఓ రాంరెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు కొర్నెలీయస్, ఇస్మాయిల్, ఏడీ వెంకన్న, సీపీఓ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలిపై కుక్కల దాడి

- అచేతన స్థితిలోనే బాధితురాలు



108 అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది



కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు

జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డ ఏరియా ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఓ కూలిపోయిన ఇంట్లో తలదాచుకుంటున్న అనాథ వృద్ధురాలు చేగోళ్ల పుష్పపై గురువారం వీధి కుక్కలు విచక్షణా రహితంగా దాడి చేశాయి. ఇంటి గడప ముందు నిద్రిస్తున్న సమయంలో ఆమెపై నాలుగైదు కుక్కలు దాడి చేయగా.. ముఖం, ఎడమ కన్ను, ఇతర శరీర భాగాల్లో గాయాలయ్యాయి. అచేతన స్థితిలో ఉన్న పుష్పను అటుగా వెళ్తున్న పలువురు చూసి కుక్కలను వెళ్లగొట్టారు. తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న వృద్ధురాలిని అక్కడ నుంచి కదిలించే పరిస్థితి లేకుండా పోయింది. రోజూ వృద్ధురాలికి పాలు, అన్నం అందించే కాలనీకి చెందిన రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ జోసఫ్ వచ్చి చికిత్స చేశాడు. ఈ విషయమై స్పందించిన పట్టణ బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ సలీం 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా అంబులెన్స్‌తో వచ్చి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దృష్టికి పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, కౌన్సిలర్ మల్లవారి అరవింద్ తీసుకెళ్లి.. మెరుగైన వైద్యం చేయించాలని కోరారు. వారికి గిర్నిగడ్డ యువకులు అరుణ్, ప్రసన్న రావు, గణేష్, ఆఫ్రోజ్ సహకరించారు. ఇదిలా ఉండగా.. ఏడు రోజుల క్రితం వీవర్స్ కాలనీలో నలుగు చిన్నారులపై కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మున్సిపల్ అధికారుల నుంచి కనీస స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గెలుపే లక్ష్యం.. ప్రజలతో మమేకం



తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్‌తో హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేష్, ఎమ్మెల్సీ పోచంపల్లి



తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు చల్లా, అరూరి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

- ఉమ్మడి వరంగల్ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం
- అక్టోబర్ 10న బహిరంగసభకు ప్లాన్ ఉందన్న అధినేత
- అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- వ్యక్తిగత ప్రతిష్టకెళ్లి కేడర్‌ను దూరం చేసుకోవద్దని హితవు

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి వరంగల్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సభ్యులు హాజరయ్యారు. బీఆర్ఎస్ నేత, టీఎస్ఆర్డీసీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రచించిన 'వెలుగుల నీడ' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. సమావేశానికి ముందు, తర్వాత సీఎంను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలకు పలు సూచనలు చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అక్టోబర్ 10న వరంగల్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నామని, దానికి ప్లాన్ ఉందన్న కేసీఆర్ మరోసారి కూర్చుందామన్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్‌లో ఈసారి మొత్తానికి మొత్తంగా రెండు పార్లమెంట్, 12 అసెంబ్లీ స్థానాలను దక్కించుకునే వ్యూహంతో ప్రజలతో పార్టీ కేడర్ మమేకం కావాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలపై పార్టీకి చెందిన కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారని, అందరినీ కలుపుకుని ముందుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యేలు వ్యక్తిగత ప్రతిష్టలకు పోకుండా.. నాయకులు కూడా ఇకనుంచి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోకుండా కలిసి పని చేయాలన్నారు. ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలను ఫోకస్ చేస్తూ మాట్లాడిన ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పేరెత్తకుండానే ఆ ఇద్దరు నాయకులు తమ పద్ధతులు మార్చుకోవాలన్నట్లు సమాచారం. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలపై వస్తున్న ప్రచారాలను నమ్మవద్దని షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆయన ఇకనుంచైనా జాగ్రత్తగా మసులుకోవాలని, లేకపోతే నష్టపోతారని వార్నింగ్ ఇచ్చినట్లు పార్టీవర్గాల సమాచారం. ఈ భేటీలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు టి.రాజయ్య, అరూరి రమేష్, ఎం.యాదగిరిరెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు 'భట్టి' పాదయాత్ర

జనగామ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర శుక్రవారం(నేడు) హనుమకొండ జిల్లా ధర్మసాగర్ నుంచి జిల్లాకు చేరుకోనుంది. ఉదయం 10.30 గంటలకు తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారానికి చేరుకుంటుంది. స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కొమ్ముగుట్ట, లింగంపల్లి మీదుగా అబ్దుల్‌నాగారం వచ్చాక తర్వాత భోజనానంతరం నర్సాపూర్, మరియపురం, నర్మెట మీదుగా తొమ్మిది కిలోమీటర్లు పాదయాత్ర చేస్తారు. శివారు ప్రాంతంలో రాత్రి బస ఉంటుంది. 29న ఉదయం 8 గంటలకు బయలుదేరి హన్మంతాపూర్, కొత్రతండా శివారుకు చేరుకున్నాక భోజనం చేసి వడ్లకొండ మీదుగా జనగామకు చేరుకుని రాత్రి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారు. 30న పట్టణంలో యాత్ర, సభ అనంతరం పెంబర్తి నుంచి యాదాద్రి జిల్లా ఆలేరు వెళ్తారు. భట్టి యాత్రకు శ్రేణులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి పిలుపునిచ్చారు.

వార్డుల అభివృద్ధి పట్టదా..!

- ప్రజలకు ముఖం చూపలేక పోతున్నాం
- గత ఎజెండాలను ఎలా పాస్ చేశారు
- ధ్వజమెత్తిన అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు
- మున్సిపల్ కౌన్సిల్‌లో అధికారుల నిలదీత





పోడియం వద్ద బైఠాయించిన చంద్రకళ, సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్త

జనగామ: వార్డుల అభివృద్ధి కౌన్సిల్‌కు పట్టదా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ముఖం చూపలేక పోతున్నాం.. అంటూ అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. కౌన్సిలర్‌గా గెలుపొంది మూడున్నరేళ్లు కావస్తున్నా.. ఆశించిన మేర అభివృద్ధి చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం.. వార్డుల నెలకొన్న సమస్యలు.. కుక్కలు, కోతుల స్వైర విహారం, గత ఎజెండా అంశాల ఆమోదంపై వాడీవేడిగా సాగింది.

ఎవరేమన్నారంటే..

వార్డుల అభివృద్ధికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి రూ.65 లక్షలు ఇవ్వడం సంతోషమని, వాటిని అన్ని వార్డులకు సమానంగా కేటాయించాలని బీజేపీ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త పేర్కొన్నారు. వచ్చే కౌన్సిల్ సమావేశానికి పోచంపల్లిని ఆహ్వానించి మరిన్ని నిధులు వచ్చేలా చూడాలని, ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేయాలన్నారు. అలాగే ఎంపీ ఫండ్స్ నుంచి నిధులు తెచ్చేలా చూడాలన్నారు. పట్టణంలో కుక్కలు, కోతులతో ప్రజల ప్రాణాలకు అపాయం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ తాళ్ల సురేష్‌రెడ్డి మాట్లాడే క్రమంలో మరో సభ్యుడు మారబోయిన పాండు లేవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ఇతర కౌన్సిలర్ల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్‌లో స్టాఫ్ ఎంత మంది ఉన్నారు? ఎవరెవరు ఏ బాధ్యత నిర్వహిస్తున్నారు..? డిప్యూటేషన్‌పై పని చేసే ఉద్యోగులు, సిబ్బంది పూర్తి వివరాలు తెలపాలని కోరారు. 14వ వార్డు కౌన్సిలర్ పేర్ని స్వరూప మాట్లాడుతూ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఏడాది నుంచి చెబుతున్నా పట్టించుకోవడం లేదని, శానిటేషన్ ట్రాక్టర్ రెగ్యులర్‌గా రావడం లేదన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ పాక రమ, 27వ వార్డు కౌన్సిలర్ ఎండీ.సమ్మద్ మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురికి నీటి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 13వ వార్డు సభ్యురాలు మల్లిగారి చంద్రకళరాజు మాట్లాడుతూ తన వార్డులో ఏ అభివృద్ధి పనీ జరగడం లేదు.. ఇప్పటి వరకు చేపట్టిన పనులను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తూ.. పోడియం వద్ద బైఠాయించారు. బీజేపీ సభ్యురాలు ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ వార్డులో ఇంతకు ముందు మంజూరు చేసిన పనులు ముందుకు సాగడం లేదని చెప్పారు. 30వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మురికి వాడల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 12వ వార్డు సభ్యురాలు గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్లుగా వార్డులో ఏ ఒక్క అభివృద్ధి పని చేయక పోవడానికి కారణాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలన్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ రామగల్ల అరుణ మాట్లాడుతూ వార్డులో శానిటేషన్ సమస్య జటిలంగా మారిందని, తక్షణమే పరిష్కరించాలని కోరారు. 16వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గాదెపాక రాంచందర్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, కోతులను నియంత్రించాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యాపారులు చనిపోయిన, ప్రమాదానికి గురైన జీవాల మాంసం సైతం ప్రజలకు విక్రయిస్తున్నారని, జంతు వధశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. 10 ఎజెండా అంశాలకు ఆమోదం లభించిందని కమీషనర్ రజిత తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కోఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, మసిఉర్ రెహమాన్, బీజేపీ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మల్లవరపు అరవింద్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొన్నాలకు పిచ్చి ముదిరింది

- ఎర్రగడ్డలో ట్రీట్‌మెంట్ తీసుకున్నాకే ప్రజల్లోకి రావాలి..
- మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మెంబర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి

జనగామ: టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యకు పిచ్చి ముదిరి పాకాన పడింది.. ఎర్రగడ్డ ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకున్న తర్వాతే ప్రజల్లోకి రావాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీపీసీసీ జిల్లా కమిటీలను రద్దు చేసిన తర్వాత కొత్తగా ప్రకటన చేయలేదని, వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని చోటా నాయకులు.. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన తనను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుతం పార్టీలో సస్పెండ్ చేసే అధికారం ఎవరికీ లేదని, త్వరలో డీసీసీల ప్రకటన రాబోతోందన్న ఆయన.. తప్పుడు స్టేట్‌మెంట్లపై పార్టీ అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా వడగళ్లు కురిసి రైతులు రోడ్డున పడితే.. వారిని ఓదారుస్తూ ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా ఉద్యమిస్తుంటే.. పొన్నాలకు కనీసం పరామర్శించే తీరికలేదని విమర్శించారు. కేసీఆర్‌కు తొత్తు, కోవర్టుగా మారిన లక్ష్మయ్యపై టీపీసీసీ సీరియస్‌గా ఆలోచన చేయాలని కోరారు. ప్రజల కోసం శ్రమిస్తున్నవారు ఎవరు.. డబ్బుల సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్న వారు ఎవరనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చారబుడ్ల రాందయాకర్‌రెడ్డి, కంచె రాములు, సిద్దారెడ్డి, గంగం నర్సింహారెడ్డి, లింగాల నర్సిరెడ్డి, ఆలేటి సిద్దిరాములు, సుకరి శ్రీనివాస్‌రెడ్డి, మోటె శ్రీనివాస్, బొట్ల నర్సింగారావు, జాయ మల్లేషం, బన్నీ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ, బాల్‌సింగ్ ఉన్నారు.

న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించేలా కష్టపడండి

- సరిగ్గా పని చేయని వారిని ఉపేక్షించేది లేదు
- కేయూ వీసీ తాటికొండ రమేశ్
- కేయూ విభాగాలను తనిఖీ చేసిన మాక్ న్యాక్ టీంలు



మాట్లాడుతున్న వీసీ రమేశ్, వేదిక మీద మాజీ వీసీలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాలని, అన్ని విభాగాల అధ్యాపకులు కష్టపడాలని, పనిచేయని వారిని ఉపేక్షించేది లేదని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీకి నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) టీం వచ్చే నెల 25, 26, 27 తేదీల్లో పర్యటించనున్న తెలిసిందే. న్యాక్‌కు ఎలా ప్రిపేర్ అయ్యారో తెలుసుకునేందుకు ముందస్తుగా నాలుగు మాక్ న్యాక్ టీంలు గురువారం అన్ని విభాగాలను తనిఖీ చేశాయి. విభాగాల్లో డాక్యుమెంట్లు ప్రదర్శించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా విభాగాల్లోని అకాడమిక్‌పరంగా, పరిశోధనలపరంగా, ప్రాజెక్టుల పరంగా అనేక అంశాలను విభాగాల అధిపతులు వివరించారు. రాత్రి క్యాంపస్‌లోని సెనేట్ హాల్‌లో అన్ని విభాగాల అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో వీసీ రమేశ్ మాట్లాడారు. న్యాక్ కమిటీ టీం రావడానికి సరిగ్గా నెలరోజుల సమయం ఉందని, ఇంకా ఏయే విభాగాల్లో లోపాలున్నాయో గుర్తించి సరిచేసుకోవాలని సూచించారు. ఏమైనా సదుపాయాలు కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని, నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. న్యాక్ టీం వచ్చినప్పుడు పర్ఫార్మెన్స్ చేయకున్నా, మంచి గ్రేడ్ రాకపోతే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేయూ, పాలమూరు మాజీ వీసీ వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. యూనివర్సిటీ లైబ్రరీ కొంత మేర అధ్వానంగా ఉందని, అందులో విద్యార్థులకు సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ తిరుపతిరావు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ ఎండీ ఇక్బాల్‌అలీ, గుల్బార్గ యూనివర్సిటీ ఆచార్యులు ఎంవీఎస్ అంబికాప్రసాద్, కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, ఐక్యూ ఏసీ డైరెక్టర్ నర్సింహాచారి. రిటైర్డ్ ఆచార్యులు గోపి కిషన్.ఆచార్య జి.షమిత, ఎస్.రాంరెడ్డి మాట్లాడారు. రెగ్యులర్ అధ్యాపకులతోపాటు, పరిపాలనాధికారులు, కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

‘అన్న’లను వెంటాడుతున్న అనారోగ్యం!

నిర్బంధం నీడలో మెరుగైన వైద్యానికి దూరం

- ఉద్యమంలో సాగలేక లొంగుబాట
- తాజాగా సీసీ నేత మూల దేవేందర్‌రెడ్డి.. దండకారణ్యం డీవీసీఎం రవికుమార్ దంపతులు
- కోవిడ్‌-19 తర్వాత అధికమైన ఆరోగ్య సమస్యలు
- అగ్రనేతలు ఆర్కే, హరిభూషణ్, మోహన్‌రావు, భారతక్క మృతి


వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ, లొంగిపోయిన మావోయిస్టు దంపతులు (వెనుక నిలబడిన వారు)

సాక్షిప్రతినిధి, వరంగల్: పీడిత ప్రజల హక్కుల కోసం తుపాకీ తూటాతోనే రాజ్యాధికారం సాధ్యమన్న విశ్వాసంతో ముందుకెళ్తున్న మావోయిస్టు పార్టీ ప్రస్తుతం గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. ఒక వైపు ఆపరేషన్ గ్రీన్ హంట్, మరోవైపు నక్సలైట్లను ఏరివేస్తామంటున్న కేంద్ర వైఖరితో పెరిగిన నిర్బంధం ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇదే సమయంలో దశాబ్దాల నుంచి పార్టీకే అంకితమై ఉన్న నాయకులు అనారోగ్యంతో మరణించడం, కొంత మంది జనజీవన స్రవంతిలోకి రావడం, మరికొంత మంది అరెస్టు కావడంతో విప్లవ ప్రయాణంలో మావోయిస్టు పార్టీకి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. వయోభారం, అనారోగ్యంతో తెలంగాణకు చెందిన మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా లొంగిపోతుండడం ఉద్యమానికి నష్టం ఏర్పడుతోంది.

కోవిడ్‌–19తో మొదలైన అనారోగ్యం..

కోవిడ్‌-19 నేపథ్యంలో మొదలైన అనారోగ్యసమస్య నేటికీ మావోయిస్టు నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చాలాకాలంగా బ్రాంకైటీస్, ఆస్తమా వ్యాధులతో అనారోగ్యం బారిన పడిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ 2021 జూన్ 21న తుది శ్వాస విడిచారు. 30 ఏళ్లపాటు ఉద్యమంలో పని చేసి 50 వరకు ఎన్‌కౌంటర్ల నుంచి బయటపడ్డ ఈయనపై ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.50లక్షల రివార్డు ఉంది. అంతకు ముందు కేంద్ర కమిటీ సభ్యుడు కత్తి మోహన్‌రావు గుండెపోటుతో మరణించారు. ఆయన సహచరి, దండకారణ్యం మాడ్ డివిజన్, ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యురాలు సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్ 22న కరోనాతో మృతి చెందింది. 2013 దర్భాలోయ కాంగ్రెస్ నేతల ఊచకోతలో కీలకనేత వినోద్ హేమ్లా అలియాస్ హుంగా, వినోదన్న జూలై 14న కరోనాతో చనిపోయారు. 2021 అక్టోబర్ 14న మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు, ఏఓబీ కార్యదర్శి అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే బీజాపూర్ అటవీ ప్రాంతంలో అనారోగ్యంతో మృతిచెందారు. నిత్యనిర్బంధం కారణంగా మెరుగైన వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కొందరు మావోయిస్టు నేతలను వెంటాడుతున్న అనారోగ్యం ప్రతికూలంగా పరిణమిస్తోంది.

అజ్ఞాతం నుంచి జనజీవన స్రవంతి వైపు..

దశాబ్దాలపాటు బాధ్యతలు భుజాలపై వేసుకున్నారు.. ఒక్కో అడుగు వేస్తూ.. మావో సిద్ధాంత పార్టీలను ఏకం చేశారు. విప్లవమే ఊపిరిగా బతికారు. అనారోగ్యం, వయోభారంతో ఒక్కొక్కరుగా జనజీవనస్రవంతిలో కలుస్తుండడం చర్చనీయాంశం అవుతోంది. 1978 నుంచి మావోయిస్టు పార్టీలో వివిధ స్థాయిల్లో పని చేసిన కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు మూల దేవేందర్ రెడ్డి అలియాస్ మాధవ్, కరప, అలియాస్ నందును ఈ నెల 21న వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్తుండగా హనుమకొండ సుబేదారి సమీపంలో అరెస్టు చేసినట్లు వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. సుదీర్ఘకాలం ఉద్యమంలో పనిచేసి అనారోగ్యానికి గురైన దేవేందర్ మావోయిస్టు పార్టీలో కొనసాగలేక జనజీవన స్రవంతిలో కలిశారన్న ప్రచారం జరిగింది. ఇదిలా ఉంటే దండకారణ్యం డివిజనల్ కమిటీ సభ్యుడు, ఎల్‌ఓసీ కమాండర్ కాసరనేని రవికుమార్ అలియాస్ అజిత్, అలియాస్ మున్నా, అలియాస్ సూర్య, ఆయన భార్య, మణుగూరు ఎల్‌ఓసీ డిప్యూటీ కమాండర్ మడివి సోమిడి అలియాస్ కల్పన గురువారం వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ ఎదుట లొంగిపోయారు. సుమారు ఐదారు దశాబ్దాలుగా పని చేస్తున్న మావోయిస్టు నేతలకు వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల లొంగుబాటలో పయనిస్తున్నారని, తాము కూడా అరవయ్యేళ్ల కిందటి ఉద్యమ అవసరాలు ఇప్పుడు లేవని, అందరూ జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతున్నామని సీపీ స్పష్టం చేశారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: మావోయిస్టు దంపతులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఎదుట లొంగిపోయారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా (పూర్వ గుంటూరు జిల్లా), మాచర్ల మండలం, కంబంపాడు గ్రామానికి చెందిన కాసరనేని రవికుమార్ అలియాస్ అజిత్ అలియాస్ మున్నా అలియాస్ సూర్యా భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజనల్ కమిటీ మెంబర్‌గా, మణుగూరు ఎల్‌ఓఎస్ కమాండర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. అతడి భార్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బత్తినిపల్లి గ్రామానికి చెందిన మడివి సామిడి అలియాస్ కల్పన మణుగూరు - పాల్వంచ ఏరియా కమిటీ మెంబర్, మణుగూరు ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్‌గా ఉండగా ఇద్దరు లొంగిపోయినట్లు చెప్పారు. రవికుమార్‌పై రూ.5లక్షలు, కల్పనపై రూ.4 లక్షల రివార్డు ఉందన్నారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోవడంతోపాటు, పార్టీపై ప్రజల నమ్మకం సన్నగిల్లడం, కీలక నాయకులు పార్టీని వీడి లొంగిపోవడం, అరెస్టు కావడం, పలువురికి ఆరోగ్య సమస్యలు రావడం, స్వేచ్ఛగా జీవించాలన్న ఆలోచన తదితర కారణాలతో ఈ మావోయిస్ట్ దంపతులు లొంగిపోయారని సీపీ తెలిపారు.

షాపింగ్ మాల్‌లో అధికారుల తనిఖీలు

వరంగల్ చౌరస్తా: పవర్ లూమ్ చీరలను హ్యాండ్లూమ్ చీరలుగా విక్రయిస్తూ, వినియోగదారులను మోసం చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం వరంగల్ నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో కేంద్ర చేనేత జౌళి శాఖ అధికారులు తనిఖీలు చేశారు. చేనేత, జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం, దక్షిణాది రాష్ట్రాల రీజినల్ డైరెక్టర్ మనోహర్, వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్‌లు విచారణ చేపట్టారు. షాపింగ్ మాల్‌లోని చీరలను, బిల్లులపై విచారణ చేశారు. షాపింగ్ మాల్‌లో పవర్ లూమ్ చీరలను హ్యాండ్లూమ్ చీరలుగా బిల్లులు జారీ చేయడంపై షాపు నిర్వాహకులకు అధికారులు ప్రశ్నించగా.. బిల్లు తప్పుగా ముద్రణ జరిగిందని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. పవర్ లూమ్‌గా చీరలను హ్యాండ్లూమ్ నేత చీరలుగా అమ్మకాలు చేస్తూ, తప్పుడు బిల్లులు అందజేస్తున్నారని బీసీ రాజ్యాధికార సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో విచారణ చేపట్టిన అధికారులను సురేశ్ కలిసి మాట్లాడారు. పవర్ లూమ్‌ను హ్యాండ్లూమ్‌గా బిల్లులు ఎందుకు వినియోగదారులకు అందచేస్తున్నారని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులను కోరారు. అందుకు అధికారులు నిరాకరించారు. బిల్లులను, చీరలను స్వాధీనం చేసున్నామని, చీరలను చైన్నైలోని ల్యాబ్‌కు పంపించి నివేదిక అందిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అధికారులు వెల్లడించారు. ఇదే విషయంపై దాసు సురేశ్ ఇంతేంజార్‌గంజ్ సీఐ మల్లేశానికి వివరించగా.. ఆధారాలు, ఫిర్యాదు లేకుండా కేసు నమోదు చేయలేమని పేర్కొన్నారు.

అన్న దగ్గరికి వెళ్తూ.. అనంత లోకాలకు

- గుర్తు తెలియని రైలు ఢీకొని చిరువ్యాపారి మృతి


ప్రభాకర్ (ఫైల్)

కాశిబుగ్గ: అన్న దగ్గరికి వెళ్తూ ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన పిట్ట ప్రభాకర్(45) గురువారం మృతి చెందాడు. జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్ గ్రామంలో సోడా బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోడా గ్యాస్ అయిపోవడంతో తన కుమారుడు అభిరామ్‌తో కలిసి గురువారం వరంగల్‌కు వచ్చాడు. ఆక్రమంలో గ్యాస్ నింపించుకుని కాశిబుగ్గలోని తన తమ్ముడి వద్ద కుమారుడిని ఉంచాడు. కరీమాబాద్‌లో ఉన్న అన్న దగ్గరకు ప్రభాకర్ ఆటోలో బయల్దేరాడు. హంటర్ రోడ్డు చిన్న బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అక్కడ ఆటో దిగి ట్రాక్ అవతలి వైపు ఉన్న అన్న దగ్గరకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే డౌన్‌లైన్ ట్రాక్ మధ్యన పడి మృతి చెందాడు. కీమెన్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతుడి వద్ద లభించిన సిమ్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి ఎంజీఎంలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

విష జ్వరంతో చిన్నారి మృతి



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌కు చెందిన కొమ్మ రాజుల శ్రీవాణి(8) విష జ్వరంతో వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కొమ్మ రాజుల రవి, కవిత దంపతుల కుమార్తె శ్రీవాణి. గ్రామంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఒకటో తరగతి చదివింది. గత రెండ్రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండగా.. తల్లిదండ్రులు వివిధ ఆస్పత్రుల్లో చూపించారు. అయినా తగ్గకపోవడంతో ఎంజీఎంలో చేర్పించారు. చికిత్స పొందుతూ చిన్నారి గురువారం మృతి చెందింది.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..


అశోక్‌రెడ్డి మృతదేహం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని చిత్తుకుంటలో పడి గ్రామానికి చెందిన కొండ్రెడ్డి అశోక్‌రెడ్డి(45) గురువారం అనుమానాసద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై మంగీలాల్ కథనం ప్రకారం.. నర్సింహులపేట గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి గ్రామ పరిధిలోని చిత్తుకుంటలో శవమై కన్పించడంతో గురువారం ఉదయం స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులు, జీపీ, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

విద్యానగర్ కాలనీలో ఫొటోగ్రాఫర్..

ఖిలా వరంగల్: విద్యానగర్ కాలనీలో అద్దెకుంటున్న హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామానికి చెందిన జంపాల రవికుమార్(56)కు రెండ్రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇంట్లో నుంచి దుర్గంధం రావడంతో గురువారం ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిల్స్ కాలనీ ఎస్సైలు సుమన్, వలీ కథనం ప్రకారం.. రవికుమార్ వరంగల్ చౌరస్తాలోని రవితేజ ఫొటో స్టుడియోలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 25న శివనగర్‌లో నివాసం ఉంటున్న చెల్లెలు సుజాతను రవికుమార్ కలిసి బాగోగులు తెలుసుకున్నాడు. అదే రోజు రాత్రి అద్దె గదికి చేరుకుని నిద్రించాడు. అదే రోజు గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం ఇంట్లోంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సైలు సుమన్, వలీ ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడి వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

దాడి కేసులో ఏడాది జైలు

వరంగల్ లీగల్: మూఢ నమ్మకాలతో ఒకరిపై దాడి చేసి గాయపర్చిన నేరం రుజువుకావడంతో హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన దండబోయిన కుమారస్వామికి ఏడాది జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ రాపోలు అనిత గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన అలేటి ఐలయ్య భార్య సుజాత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. 2016 మే 18న రాత్రి దండబోయిన కుమారస్వామి ఇంటి ఎదుట సుజాత చేతి నుంచి నిమ్మకాయలు జారిపడ్డాయి. ఈ ఘటనను మూఢ నమ్మకాలతో కూడిన ఉద్దేశ్యపూరిత చర్యగా భావించి మరుసటి రోజు ఉదయం కుమారస్వామి, అతడి భార్య లక్ష్మి దుర్భాషలాడారు. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించిన అలేటి ఐలయ్య, సుజాత దంపతులను కుమారస్వామి, లక్ష్మి, వారి కుమారుడు సుభాశ్ మూకుమ్మడిగా దాడి చేసి కర్రలతో కొట్టారు. దీంతో ఐలయ్య కాలుకు తీవ్ర గాయమైంది. జరిగిన ఘటనపై బాధితుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో కుమారస్వామి దాడి చేసినట్లు రుజువు కావడంతో ఆయనకు ఏడాది జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి రాపోలు అనిత తీర్పునిచ్చారు. కేసును పోలీసు అధికారులు డి.విజయ్‌కుమార్, ఎ.శ్రీనివాస్ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సాక్ష్యులను కానిస్టేబుల్ దేవేందర్, హోంగార్డు రవి కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాధ వాదించారు.

సీఎల్పీ నేతకు సమస్యల వెల్లువ



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పాదయాత్ర చేస్తున్న భట్టి, పక్కన తదితరులు

- గ్రామాల్లో మహిళల కన్నీటి వేదన
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజలు అన్ని రకాలుగా లబ్ధి పొందుతారు: భట్టి

కాజీపేట: హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రకు మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. దాదాపు ఎనిమిదిన్నరేళ్లుగా క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామ శివారు నుంచి ప్రారంభమైన భట్టి పాదయాత్ర బండ తండా, కమ్మరిపేట తండా, చింతల్ తండా, మాటుతండా, వేలేరు తదితర గ్రామాల ప్రజలు డప్పులు, వాయిద్యాలు, మంగళ హారతులతో పాదయాత్రకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా మహిళలు, యువకులు ఉద్యోగ అవకాశాలతో పాటు తాగు, సాగు నీరు, దళిత బంధు వంటి పథకాలు దక్కడంలేదని, ఎమ్మెల్యే అనుచరవర్గానికే డబ్బులకు అమ్ముకుంటున్నట్లు ఆరోపించారు. ‘కాంగ్రెసోళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఇండ్లు ఇచ్చారు. భూములు ఇచ్చారు. వైఎస్సార్ ప్రభుత్వం ఉన్నప్పుడు పింఛిన్లు, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీకార్డులు ఇచ్చింది. కానీ ఇప్పుడవేవీ లేవు’ అని ఆవేదన చెందారు. ఇప్పుడిచ్చే పింఛన్‌తో నెల సరుకులు కూడా తెచ్చుకోలేకపోతున్నామని, రేషన్ షాపులో ఒక్క బియ్యం మాత్రమే ఇస్తున్నారని, ఊరికి నాలుగైదు బెల్టు షాపులు పెట్టడం వల్ల ఇంట్లో మగవాళ్లు సంపాదించే రోజు కూలీ మొత్తం మందుకే ఖర్చు చేస్తున్నారని కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఇందిరమ్మ రాజ్యంతో పరిష్కారం

ఈసందర్భంగా మహిళలతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పేదల ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటేసి అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేలా.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా తెలిపిన మాలపు రాజమ్మ, దరావత్ లచ్చమ్మ, మారావత్ అనితను భట్టి అభినందించారు. కార్యక్రమంలో సింగపురం ఇందిర, సిరిసిల్ల రాజయ్య, కత్తి సంపత్ కుమార్‌గౌడ్, గంగారపు అమృతరావు, సద్దాంహుస్సేన్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జవాన్ ప్రాణం తీసిన దళితబంధు వాహనం


రాజశేఖర్ (ఫైల్)

ఖానాపురం: సెలవుపై వచ్చిన ఆర్మీ జవాన్‌ను దళితబంధు వాహనం పొట్టనబెట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 11న రోడ్డు పక్కన ఆగి ఫోన్ మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన బుర్ర రాజశేఖర్ (31)ని దళితబంధు వాహనం(ఆటో ట్రాలీ) వేగంగా వచ్చి ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజశేఖర్ ఆర్మీలో జవాన్‌గా పని చేస్తున్నాడు. గత నెలలో బీహార్‌కు బదిలీ అయ్యాడు. దీంతో సెలవులపై కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 11న హనుమకొండకు పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో ఫోన్ రావడంతో గీసుగొండ మండల పరిధి కొమ్మాల శివారులో రోడ్డు పక్కన ఆగి మాట్లాడుతుండగా.. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంటకు చెందిన ఆటో ట్రాలీ(దళితబంధు) వాహనం వెనకాల నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా.. స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. రాజశేఖర్‌కు 2015లో వివాహం జరిగింది. భార్య మాళవికతో పాటు కుమారుడు సాయి తేజ, కుమార్తె వర్ష ఉన్నారు. రాజశేఖర్ సెలవులు ముగించుకొని ఈనెల 22న విధుల్లో చేరాల్సి ఉండగా.. ఇంతలోనే ప్రమాదం జరిగి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. మాళవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు.

భక్తులపై దాడి ఘటనలో 11 మందిపై కేసు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి: వనదేవతల్ని దర్శించుకునేందుకు మేడారం వచ్చిన భక్తులపై దాడి చేసిన 11 మందిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కుదునూరి గ్రామానికి చెందిన కొక్కెర వంశీ కుటుంబీకులతో కలిసి బుధవారం మేడారం వచ్చాడు. వారంతా గోవిందరాజుల భవనంలో విడిది చేశారు. వారి పక్కనే విడిది చేసిన భక్తులు డీజే సౌండ్ ఎక్కువగా పెట్టి డ్యాన్స్ చేస్తూ కేకలు వేయడంతో వంశీ తరపు వ్యక్తులు సౌండ్ తగ్గించాలని కోరారు. అవతలి వ్యక్తులు వారిపై అకస్మాత్తుగా కర్రలు, బీరు సీసాలతో దాడి చేశారు. వంశీ కుటుంబ సభ్యులతోపాటు మరికొందరికి గాయాలయ్యాయి. వెంటనే భక్తులు 100 డయల్ చేయగా.. తాడ్వాయి పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపు చేశారు. భక్తులపై దాడికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దాడి విషయంపై పోలీసులకు వంశీ గురువారం ఫిర్యాదు చేశాడు. దాడికి పాల్పడిన ఆవుల అరుణ్, సంకె సాగర్, భూమ చందు, ఆవుల దేవేందర్, మేకల స్వామి, మహేశ్, శేషు, నోహిత్, శివమణితోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.7 లక్షల విలువైన 35 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: ఆటోలో సౌండ్ స్పీకర్ల మాటున గంజాయి తరలిస్తున్న నలుగురు ముఠా సభ్యులను స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్, కేయూసీ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. నిందితులు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన పబ్బతి సాగర్, హనుమకొండ జిల్లా గుండ్లసింగారానికి చెందిన అంగిడి ఉమాశంకర్, రెడ్డికాలనీకి చెందిన భూక్యా సునిత, శాయంపేటకు చెందిన రామినడ్ల చింటును అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన రాము, శాయంపేట మండలం గట్లకనపర్తికి చెందిన పారుపల్లి కార్తీక్, హైదరాబాద్‌కు చెందిన శివ, ఉపేందర్, హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన భూక్య వంశీలు పరారైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.7 లక్షల విలువైన 35 కిలోల గంజాయి, సెల్ ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురంలో నిందితులను పట్టుకుని వారి దగ్గర ఉన్న 17 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పబ్బతి సాగర్ ఆటోలోని సౌండ్ స్పీకర్లలో గంజాయి పెట్టి హైదరాబాద్‌కి తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆటోకు ఎస్కార్ట్ వాహనంగా కారులో ప్రయాణిస్తున్న నలుగురు పరారైనట్లు సీపీ తెలిపారు. గంజాయిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్‌రెడ్డి, పి.దయాకర్, ఎస్సైలు బి.శరత్‌కుమార్, పి.లవన్‌కుమార్, ఎండీ నిస్సార్‌పాషా, ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, స్వర్ణలత, కానిస్టేబుళ్లు శ్యామ్‌సుందర్, సురేశ్, ప్రభాకర్, రాజేందర్, శ్రీనివాస్, కరుణాకర్, మహబూబ్ పాషా, నాగరాజు, శ్రావణ్‌కుమార్‌ను సీపీ అభినందించారు.

ఎస్టీ జాబితాలో బీసీలను చేర్చడంపై ఉద్యమం

- రాష్ట్ర ఆదివాసీ జేఏసీ చైర్మన్ చందా లింగయ్య


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ చందా లింగయ్య

హన్మకొండ: ఎస్టీ జాబితాలో బీసీలతో పాటు ఇతర కులాలను చేర్చడంపై పోరాటం చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ జేఏసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య తెలిపారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ జేఏసీ సమావేశం జరిగింది. ఇందులో ఆదివాసీల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. జేఏసీ చైర్మన్‌గా చందా లింగయ్యను ఎన్నుకున్నారు. ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాల సంఘం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులను రాష్ట్ర కన్వీనర్లుగా ఎన్నుకున్నారు. చందా లింగయ్య మాట్లాడుతూ.. ఎస్టీలో 11 బీసీ కులాలను కలుపుతూ అసెంబ్లీ చేసిన తీర్మాణాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఆదివాసీలంతా సంఘటితమై పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈఉద్యమంలో ఆదివాసీలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, ప్రొఫెసర్ ఈసం నారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ పార్థసారథి, కె.చొక్కయ్య, పి.శ్రీనాథ్, గొప్ప వీరయ్య, నల్లబోయిన లక్ష్మణ్‌రావు, బుగ్గ బాబా, పోడెం నాగేశ్వర్ రావు, ఝెట్టి సారయ్య, మంకిడి బుచ్చయ్య, కె.రాంబాబుతో పాటు ఆదివాసీ సంఘాలు, ఉద్యోగసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.